# తాత ముద్ద

## కేసీఆర్ (ఉచిత భోజనం, విద్య)

'సర్కారు బడికి పోతే సక్కని సదువు చెబుతారు. కడుపునిండా కమ్మని బువ్వ పెడతారు' అనే నమ్మకాన్ని తెలంగాణలోని తల్లిదండ్రులకు కల్పించింది కేసీఆర్ సర్కారే. పోటీ ప్రపంచంలో పిల్లలు నెగ్గుకు వచ్చేలా పాఠశాలల్లో వసతులను మెరుగుపర్చారు కేసీఆర్. కాలానికి అనుగుణంగా డిజిటల్ విద్య ప్రవేశపెట్టారు. పిల్లలకు చదువులతో పాటు చక్కని పౌష్టికాహారం కూడా అందించేలా కార్యాచరణ రూపొందించారు. పాఠశాలల్లోనే బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.





## కామరాజ్ (మధ్యాహ్న భోజనం)

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కామరాజ్‌ను 'మిడ్‌డే మీల్స్'కు ఆద్యుడుగా భావిస్తారు. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే చదువు ఒంటపడుతుందని కామరాజ్ ప్రగాఢ విశ్వాసం.1956లో తిరునెల్వేలి జిల్లాలోని ఎట్టాయపురంలో మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ నిర్ణయానికి అపూర్వ స్పందన వచ్చింది. దీంతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకూ  విస్తరించాలను కొన్నారు. కానీ, నిధుల కొరత అవరోధంగా మారింది. కేంద్రం సాయమూ పరిమితంగా ఉండేది. అయితే, ఈ సత్కార్యం ఆగిపోకూడదన్న ఉద్దేశంతో స్వచ్ఛంద సంస్థలు, దాతల నుంచి విరాళాలను సేకరించి మరీ పిల్లలకు అన్నం పెట్టారు. సీఎం హోదాలో ఉన్నప్పటికీ సామాన్యుడిలా విరాళాల కోసం జోలె పట్టారు కామరాజ్.

# గుండెల్లో గుడి

## కేసీఆర్ (యాదగిరి వైభవం)

ప్రభుత్వ నిధులతో ఆలయాలను నిర్మించిన దాఖలాలు స్వతంత్ర భారత చరిత్రలోనే లేవు. తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలనలోనే అది సాధ్యమైంది. యాదగిరి గుట్ట ఆలయాన్ని పునర్నిర్మించి భారతదేశ ఆధ్యాత్మిక చరిత్రలో కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టిన కేసీఆర్... వేములవాడ, కాళేశ్వరం, ధర్మపురి, బాసర, కొండగట్టు, భద్రాచలం.. ఇలా రాష్ట్రంలోని అన్ని ఆలయాలనూ దశలవారీగా అభివృద్ధి చేశారు. తొమ్మిదేండ్లలో రూ.2,800 కోట్ల నిధులు కేటాయించారు. ఆర్థికంగా అత్యంత వెనుకబాటుకు గురైన బ్రాహ్మణుల సంక్షేమానికి వివిధ పథకాల ద్వారా బీఆర్‌ఎస్ సర్కారు దాదాపు రూ. 212 కోట్లు ఖర్చు చేసింది.





## వల్లభ్‌భాయ్ పటేల్ (సోమ్‌నాథ్ ఆలయం)

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన గుజరాత్‌లోని సోమ్‌నాథ్ క్షేత్రానికి దాదాపు రెండువేల ఏండ్ల చరిత్ర ఉంది. ముస్లిం పాలకుల దండయాత్రలతో జీర్ణావస్థకు చేరిన ఈ పురాతన ఆలయాన్ని తప్పకుండా పునర్నిర్మిస్తామని ఉక్కుమనిషి, భారత తొలి ఉప-ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మూడు నెలలకే ప్రకటించారు. అయితే ఆలయం పునరుద్ధరించే అంశం రాజకీయంగా వివాదాలకు దారితీయొచ్చని అప్పటి ప్రధాని నెహ్రూ వారించే ప్రయత్నం చేశారు. అయినా వెనక్కి తగ్గలేదు. సోమ్‌నాథ్ ఆలయాన్ని అబ్బురపరిచేలా తీర్చిదిద్దారు.